

## పెద్దకథ: హేమంతవళి

'వింధ్యవాసిని'

మాటలూ, చేష్టలూ కూడా అంతే. అంత చిన్న వయసుకే ఆరిందాలా ఆలోచించేవాడు. తనేదయినా తెలుసుకోవాలనుకుంటే, దాన్ని విడమరిచి చెప్పేదాకా, తను అర్థం చేసుకునేదాకా వదలడు. ఎప్పుడయినా, ఏదయినా ప్రామిస్ చేసుంటే, ఆరునూరయినాసరే దాన్ని మరిచిపోడు. నువ్వు ఫలానా వస్తువిస్తానని ప్రామిస్ చేశావని గుర్తు చేస్తాడు.

స్కూల్లో తన క్లాస్ పిల్లలతో ఏం మాట్లాడతాడో కానీ ఇంట్లో మాత్రం సీరియస్‌గా ఉండేవాడు. వాడి పెద్ద కళ్ళు, అందులోని పెద్ద కనుపాపలూ, చూపుల్ని తీక్షణంగా మార్చేవి.

సత్యమూర్తి దగ్గిర మాధవకి బాగా చనువు. అతనొస్తే వాడు అడిగే ప్రశ్నలకి అంతు ఉండదు. అతనూ ఓపిగ్గా సమాధానాలు చెబుతుంటాడు.

అహ్మద్‌కి లాగే బాబుకీ రామాయణం కథ అన్నా రాముడన్నా ఇష్టం. రాముని అంత పెద్ద హీరో ఇంకెవరూ వుండరని వాడి ఉద్దేశ్యం. అహ్మద్‌కి శ్రీరాముడు జీవితంలో కష్టాల్ని, సుఖాల్ని సమభావంతో ధైర్యంగా ఎదుర్కోవటం నచ్చితే వీడికి రాక్షసులని ఎదుర్కొని ఎడాపెడా బాణాలు వేయటం నచ్చింది.

"అంకుల్! రాముడంటే చాలా గొప్పకదా? అతనికి చాలా బలం వుంటుంది కదూ?" అని సత్యమూర్తి నడిగాడో రోజు.

"అవును మాధవా?" అంటే, "నేను పెద్దయితే రాముడిలా బాణాలేసి రాక్షసుల్ని చంపేస్తా" అని సీరియస్‌గా చెప్పేశాడు.

వాడి మాటలకి వచ్చిన నవ్వునాపుకుంటూ "అలాగే రాముడిలా

అవుదువుగానీ, ఇప్పట్లో బాణాలుపయోగించరు బాబూ! పెద్ద తుపాకుల్తో ధమధమాలని కాల్చుకుంటారు.'' అని చెప్పి ఆవేళ వాడికొక మంచి ఇంగ్లీష్ స్టంట్ పిక్చర్ చూపించాడు. ఇంటికొచ్చాక తనకి అర్థం అయినంతలో ఎంత చక్కగా చెప్పాడో!

## 15

కొన్ని రోజులనించీ గమనిస్తున్నా. ఎదురింట్లో కొత్తగా వచ్చిన ఒకతను రోజూ నేను స్కూల్‌కి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు నావయిపు చూస్తూ అలాగే నుంచునేవాడు, కనీసం నేనేమనుకుంటానో అన్న బెదురు కూడా ఉన్నట్లు లేదు. పోనీలే, చూస్తే నాకేమయింది? అని సరిపుచ్చుకున్నాను.

ఒక ఆదివారం మధ్యాహ్నం మాధవ నిద్రపోతుంటే నేనేదో పుస్తకం చదువుకుంటూ పడుకున్నాను. దగ్గరగా వేసి వున్న తలుపు చప్పుడవుతే చూశాను. తోసుకుని లోపలికివచ్చి చొరవగా కుర్చీలో కూచున్నాడు–ఎదిరింటతను! నాకు భలే కోపం వచ్చింది. అయినా నిగ్రహించుకుని మంచంమీద కూచుంటూ, ''ఏంకావాలండీ? ఎవరు మీరు?'' అన్నాను.

''రోజూ చూస్తూనే వుండీ ఎవరని అడుగుతావేం? ఏం కావాలో ఎట్లా చెప్పేది? అయినా నీకు తెలియదు కనకనా నేను చెప్పేది!'' అంటూ వెకిలిగా నవ్వాడు.

''ఆదేమిటి. చెప్పందే నాకెలా తెలుస్తుంది? అయినా బొత్తిగా మంచీ మర్యాదా లేకుండా ఇలా పరాయివాళ్ళ ఇళ్ళలో చొరబడ్డమేమిటి!'' అని గదమాయించాను. కానీ నా మాటలేవీ అతని చెవిలో పడినట్లు కనిపించలేదు.

లేచి వెళ్ళి గబగబా ముందుతలుపు వేసి గడియ పెట్టాడు. నాకు భయం వేసింది. నావయిపుగా వస్తూ, ''ఇప్పుడర్థమయిందా? ఏంకావాలో. ఇంకా వివరంగా చెప్పాలా'' అన్నాడు. అదే వెకిలినవ్వు....కంపరం పుట్టించే నవ్వు....చాచి చెంప పగలగొడదామా అన్పించింది.

ఏం చేస్తాడోనని భయంతో, ఏమీచేయాలో తెలియక నేను అవాక్కై చూస్తుండగానే, నా భుజాలచుట్టూ చెయ్యివేసి నలుపుతూ, ''నీ చరిత్ర నాకు తెలీదూ? ఎందుకు పతివ్రతలా నటిస్తావు. నేచెప్పినట్లు విను. నిన్ను డబ్బులో ముంచెత్తుతాను. ఒక పిల్లాణ్ణి కనీ ఇంత అందంగా వున్నదాన్ని నిన్నే చూస్తున్నాను'' అన్నాడు, ఆ మనిషి నా కంటికి నరరూప రాక్షసుడిలా కన్పించాడు. భగవాన్! నన్ను కాపాడేభారం నీదే అనుకున్నాను. కళ్ళు మూసుకుని—ఆ రాక్షసుడి చేతుల్ని విడిపించుకోవాలని ప్రయత్నిస్తూ. ఇంతలో తలుపు చప్పుడయింది.

అబ్బ! దేవుడే నాకోసం ఎవర్నో పంపాడనుకున్నాను. అంతదాకా అన్ని మాటలు వాగిన ఆ వెధవ తలుపు చప్పుడుకి కాస్త బెదిరాడు. అవకాశం చిక్కించుకుని వాడిచేతులు విడిపించుకుని, రెండడుగుల్లో వెళ్ళి తలుపు తీశాను. ఎదురుగుండా సత్యమూర్తి నుంచుని వున్నాడు. ఒక్క క్షణంలో జరిగిందేమిటో అతనికి అర్థమయిపోయి ఉంటుంది. కోపంతో ఆ ఎదిరింటివాడి వయిపుగా రాసాగాడు.

వాడేమీ చూసుకోకుండా, ''రోజూ ఈ వెధవతో కులుకుతూనే వున్నావుగా? వాడికంటే నేనేం తీసిపోయాను'' అని ఉక్రోషంగా అంటూ బయటికి అడుగు వేశాడు. వాడి మాటలకి సత్యమూర్తికి కోపం మరింత ఎక్కువయింది. ఒక్క ఉదుటున వాడి కాలర్ పట్టి గుంజి, రెండు చెంపలూ ఎడా పెడా వాయించి, అలాగే లాక్కెళ్ళి తలుపు బయటికి తోసేశాడు.

జరిగిన సంఘటనతోనే నాకు సిగ్గుతో చచ్చినంత పనయింది. దానికి తోడు ఆ వెధవ మమ్మల్నిద్దర్నీ అవమానిస్తూ అన్న మాటలు మరింత కుంగదీసాయి. తల వంచుకుని మంచం మీదోమూల కూచుండి పోయాను. కనీసం సత్యమూర్తిని కూచోమనయినా చెప్పలేదు. వెనక్కి వచ్చి అతనూ నా ముఖం చూడలేని వాడిలా కొద్దిసేపు ఎటో చూస్తూ కూచున్నాడు. ఆఖరుకు తనే, ''సారీ సీతా: మీరేం బాధపడవద్దు. నేను మళ్ళీ వస్తాను. తలుపు జాగ్రత్తగా వేసుకోండి'' అని చెప్పి పెద్ద పెద్ద అంగలేస్తూ వెళ్ళిపోయాడు.

తరవాత మూడు రోజులకి ఒక సాయంత్రం వచ్చాడు సత్యమూర్తి. అతను సామాన్యంగా మా ఇంటికొచ్చేది ఆదివారాలే. అంతేకాకుండా అతని ముఖం ప్రత్యేకించి సీరియస్‌గా వుంది. అతనేదో మాట్లాడాలని ఆదేపనిగా వచ్చాడని అర్థమయింది.

నే కాఫీ ఇస్తే తీసుకుని, ''మీతో కొంచం మాట్లాడాలి సీతా!'' అన్నాడు తనవళ్ళో ఎక్కికూచున్న మాధవ వయిపు సాలోచనగా చూస్తూ. అతడి చూపుల భావం నాకర్థమయింది. వాణ్ణి మెల్లగా దింపి పనిపిల్ల వెంట పార్క్‌కి పంపించాను.

''అసలు విషయాన్నెలా మొదలు పెట్టాలో తెలియకనే ఇన్నాళ్ళూ చెప్పలేకపోయాను. ఆరు నెలలక్రితం రాసిన ఐ. ఏ. ఎస్ పరీక్షల్లో సెలక్ట్ అయినట్లు తెలిసింది. ఇంటర్వ్యూ కూడా పాసిటివ్ రిజల్ట్స్ వచ్చింది. త్వరలో ఏవూరికయినా పోస్టింగ్స్ వేస్తే హైదరాబాద్ వదిలి వెళ్ళాల్సి వుంటుంది. అందుకే ఇక ఆలస్యం చేసి లాభంలేదని ఆవాళ వచ్చాను. నా అదృష్టం సరిలేక ఆరోజు ఆ దుర్ఘటన జరిగింది.....మీరేమీ అనుకోనంటేనే చెబుతాను. నేను చెప్పేది మీకు ఇష్టమున్నా లేకపోయినా మన మధ్య స్నేహానికి మాత్రం భంగం రాకూడదు.'' జవాబుకోసం నావంక చూశాడు సత్యమూర్తి.

అలాగే నన్నట్లు తల ఊపాను.

''నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. మీరు అహ్మద్‌ని ఎంతగా ప్రేమించారో నాకు తెలుసు. అయినా...''

''మా ఇద్దరి మధ్యా వున్న ప్రేమ, అనుబంధం అన్నీ తెలిసీ మీరిలా అడుగుతుంటే నాకాశ్చర్యంగా వుంది. ఒకవేళ నేనే మీకటువంటి ఆశ ఏమయినా కల్పించానా నాకు తెలియకుండా....'' అర్థంలోనే ఆగిపోయాను.

''అబ్బెబ్బే. అలాంటిదేం లేదు సీతా. ఇది పూర్తిగా నావయిపునించే వచ్చిన ప్రపోజల్ మాత్రమే.''

ఆతనిలాంటి ప్రపోజల్ చేస్తాడని నేను కలలో కూడా అనుకోలేదు. నాకు అహ్మద్ కంటే ముందునించే ఇతనితో పరిచయం వుంది. మంచివాడు. స్నేహశీలి–అని అతన్ని గూర్చి నా అభిప్రాయం. అహ్మద్‌తో నా స్నేహానికీ, పెళ్ళికీ అవకాశం కల్పించింది ఇతనే. అందుకే అతనంటే నాకొక ప్రత్యేకాభిమానం.

ఇక అహ్మద్ పోయి ఒంటరిగా మిగిలినప్పుడు, తోడుగా నిలిచి,

సహాయాన్ని, సలహాలని కూడా ఇచ్చారు. అందుకే నాలో అతనిపట్ల చెప్పలేనంత కృతజ్ఞత ఉంది. ఆ కృతజ్ఞతవల్లనే, అతను చేసిన ప్రపోజల్ నాకు అవమానకరంగా తోచినా నేను తప్పు పట్టకుండా శాంతంగానే జవాబులిచ్చాను.

"అలా అయితే స్నేహితుడి భార్య ఒంటరిగా కష్టాల్లో వున్నదని జాలిపడి అడుగుతున్నారా?"

"అనవసరంగా మీరు నన్ను అపార్థం చేసుకుంటున్నారు సీతా!"

"ఇందులో అపార్థం ఏముంది మూర్తిగారూ! మాది ప్రేమ వివాహమని మీకు తెలుసు. మీ స్నేహితుడు పోయినా నేనింకా బతికున్నానంటే అది మాధవకోసమే. ఇదీ మీకు తెలియంది కాదు. అలాంటప్పుడు అయన్ని మరిచిపోయి, మిమ్మల్నయినా మరెవర్నయినా నా జీవితంలోకి ఎలా ఆహ్వానిస్తాననుకున్నారు? భారతస్త్రీ ఒకే భర్తకు అంకితం కావాలి – అని నీతివాక్యాలు చెప్పనుకానీ, అహ్మద్ జ్ఞాపకాలు, ఎప్పుడూ నాలో నిలిచే వుంటాయనీ వాటినెవరూ చెరిపేయలేరనీ మాత్రం చెప్పగలను," అన్నాను సీరియస్‌గా.

"ఓహ్! నా మనసుని మీకు పూర్తి అర్థమయేలా ఎలా చెప్పేది? మీరు మధ్యలో ప్రశ్నించకుండా వినండి. మొదట్నించీ నా మనసులో జరిగిన యుద్ధాన్ని గురించి చెబుతాను.

ఆనాడు రాజారావుగారు మొదటగా మిమ్మల్ని పరిచయం చేసినప్పుడే, ఎందుకోగానీ, ఎన్నాళ్ళుగానో మనిద్దరి మధ్య ఎంతో స్నేహం వున్నట్లు చాలా ఆత్మీయులుగా కన్పించారు. నాకు కాలేజీలో చదివేటప్పట్నించీ ఆడపిల్లలంటే ఎలర్జీ. దానిక్కారణం నేను చూసిన కొందరి అతివాగుడు, విచ్చలవిడి తనమేనేమో అనిపిస్తుంది. ఎంతో అమాయకంగా, చిన్న పిల్లలా ఉన్న మిమ్మల్ని చూసి, ఈ అమ్మాయి, ఈ సిటీలైఫ్‌ని, ఉద్యోగాన్ని ఎలా నెగ్గుకొస్తుందా అన్పించింది. అందుకే ఎలాంటి సహాయమయినా మీరు అడిగితే చాలు చేయాలన్పించేది.

"మీరు గదికోసం నన్నడగటం నేను మా ఇంట్లోనే చూపిస్తే, మీకు నచ్చి, మీరు చేరటం నాకెంతో సంతృప్తిని కలిగించింది. మీరు నన్నడగకుండా, ఎక్కడో గది చూసుకుని, వంటరిగా చేరి వుంటే నేనెంత దిగులుపడివుండేవాణ్ణో మీకు తెలీదు.

"జీవితంలో పెళ్ళనేదాని జోలికే వెళ్ళకూడదని నా నిర్ణయం. ఎవరో తెలియని వ్యక్తిని నా జీవితంలోకి రానివ్వటం, ఆ వ్యక్తికోసం నా అలవాట్లు మార్చుకోవటం, నా అభిరుచుల్ని ఆవిడ మీద రుద్దటం, చూసిచూసీ వున్న స్వేచ్ఛను పోగొట్టుకుని, సంకెళ్ళు వేసుకోవటమే అన్పించింది.

"అందుకే మీపై నాకున్న అభిమానానికి అసలు అర్థం నాకు చివరి దాకా తెలియలేదు. మీరు మాట్లాడితే వినాలనీ, మీతో స్నేహం చేసి దగ్గరగా గడపాలనీ, అమాయకంగా వున్న మీ ముఖం వైపు చూడాలనీ ఇలా ఎన్ని కోరికలు నా మనసులో ఏర్పడినా, వాటిని అణచుకుంటూనే వచ్చాను. వాటికి మూలమయిన శక్తి ఏమిటో తెలుసుకోవాలని నేనెప్పుడూ ప్రయత్నించలేదు.

"అందుకే అహ్మద్ మిమ్మల్ని ప్రేమిస్తున్నాడని తెలిసిన రోజున నేనంత బాధపడలేదు. కానీ రానురాను మీ ఇద్దరి మధ్యా స్నేహం ఎక్కువయి, మీరు నాతో మాట్లాడటం తగ్గిపోయింది. మీకున్న తీరిక సమయాలన్నీ అతనితోనే గడిపేవారు. అప్పుడు మొదలయింది నాలో సంచలనం. నా స్వంతమైనదేదో పరాయిపాలై పోతున్నట్లు అనిపించింది.

ఆ సంచలనానికి కారణమూ, నాలో ఏర్పడిన జెలసీకి అర్థం నేను తెలుసుకునేసరికి మీ పెళ్ళి అయిపోయింది. ఇదీ నా కథ. ఎవరికీ చెప్పకుండా నాలోనే దాచుకున్న నా ప్రేమ కథ."

అతనలా అంటుంటే నిజంగా నాకెంతో జాలివేసింది. ప్రేమించి, ప్రేమించబడటం ఎంత అదృష్టమో, ప్రేమించి ఆ ప్రేమ వ్యర్థమవటం అంత దురదృష్టంకూడాను. కోరుకున్నవారిని జీవిత భాగస్వామిగా పొందటం ఎంతటి వరమో, కోరుకున్నవారి గడపనయినా దాటలేకపోవటం అంతటి శాపమేమో! అయినా అప్పట్లో స్నేహితుడిముందు తన ప్రేమని బయటపెట్టని అతని ఔదార్యానికి మనసులోనే మెచ్చుకోకుండా ఉండలేక పోయాను.

"నేనింత కథా ఎందుకు చెబుతున్నానంటే, మీ ముందు మిమ్మల్ని పెళ్ళాడగోర్తున్న నా అభిమానం ఈ నాడు మీపై జాలివల్ల కలిగిందికాదని మీకు అర్థం అవటానికే. ఒంటరిగా ఉన్నారుకదా అని చులకనచేసి పెళ్ళాడతానని అంటున్నానని అపార్థం చేసుకోకుండా ఉండటానికే.

"అయితే ఒకటి–మీపై నాకు జాలీ, సానుభూతీ లేకపోలేదు. కానీ స్నేహితుడి భార్యగా కంటె, నా మనసులో నిలిచిన ప్రేమమూర్తిగా, మీరు బాధపడుతుంటే సహించలేని జాలీ, సానుభూతీ అవి."

"ఒకప్పుడు అహ్మద్ అంటే జెలసీ లేకపోలేదు. కానీ ఇవాళ అతను లేడు. ఏ దూరతీరాలకో వెళ్ళిపోయాడు. మీచేత అంతగా ప్రేమించబడీ, విధిలిఖితం వల్ల మీనుండి దూరమయిన నా స్నేహితుడితో పోటీపడేంత మూర్ఖుణ్ణి కాదు." అన్నాడతను మళ్ళీ.

అతని మాటలొక్కొక్కటీ నెమరువేస్తూ, ఆలోచించుకుంటున్నాను. ఏం చెప్పాలో తెలీక ఊపిరాడనట్టుగా వుంది. అతను ఏనాడో నాకు తెలీకుండా నన్ను ప్రేమించాడనే విషయాన్నే హఠాత్తుగా వినటం వల్లనేమో జీర్ణించుకోలేకుండా వున్నాను.

"నేను భర్త పోయిన దాన్నే కాదు మూర్తిగారూ! కన్న కొడుకు కాకపోయినా, మమకారంతో పెంచుకున్న పెంపుడుకొడుకు ఒకడున్నాడు నాకనే విషయం మీరు మరిచిపోయారా? వాడికి మీరిచ్చే స్థానం ఏమిటి?" అన్నాను సందిగ్ధంగా.

"మీకు మాత్రమే విలువిచ్చి, మాధవని దూరం చేయమనేంత రాక్షసుణ్ణికాను సీతా! వాడంటే నాకెంత ఇష్టమో మీకు తెలీదు? ఇన్నాళ్ళుగా వాడికి నేను దగ్గరయ్యాను. ఒకటే భేదం. అంకుల్ అనటం మానేసి నాన్నా అని పిలుస్తాడు–మనం నేర్పితే....ఏమంటారు–చెప్పండి సీతా!"

"ఏమిటండీ మీ పిచ్చి. మీరు నిర్ణయించుకోటానికి ఇన్నేళ్ళు పట్టిందే నన్ను ఆలోచించుకోవటానికి కొన్ని రోజులయినా వ్యవధి ఇవ్వరా?" అన్నాను వాతావరణాన్ని తేలికపరచే ఉద్దేశంతో.

అతను కూడా తేలిగ్గా నవుతూ, "సారీ! నా ఆత్రుతలో మీ పొజిషన్ ఆలోచించలేదు, బాగా ఆలోచించుకునే నిర్ణయించుకోండి. మాధవనిగురించి

దిగులు పడవద్దు. వాడికి బాధ్యతగల తండ్రిని కాలగననే నమ్మకం నాకుంది. ఇంతే నేను చెప్పేది'' అతను ముగించి లేచేలోగా, "అంకుల్" అంటూ పార్క్‌నించి వొచ్చాడు మాధవ.

## చరమగీతి

మధురోహల గతానికి
తలుపులు మూయమంటున్నావు
నిరాశామయ భావికి
పునాదులు తవ్వమంటున్నావు
అంధకారంలో చిరు వెలుగులు చిమ్మావు....

పగిలిన నా ఎద తునకలు
మమతలతో అతికావు....

పంకభరిత జీవన భాండాన్ని
ప్రేమామృతంతో శుద్ధి చేశావు....
యిప్పుడు నీవేమీ నాకు కావంటే
నిరాశామయ భావి నాకు మృత్యు సంగీతంతో
స్వాగతం పలుకుతుంది....

వెలుగు మింగిన నా గతం
అంధకారమై నన్ను చుట్టుకుంటుంది.
ఎలా సరిపెట్టుకోను?
ఎలా ఈ అమృతాన్ని కాలదన్నుకోను?
చవిచూచిన దైవత్వాన్ని
ఎలా వొదులుకోను?

ఒక్కటి చెప్తున్నా విను....
మళ్లీ నిశీధిని కౌగలించుకోను....
మళ్ళీ నా గుండెల్లో బురద నింపుకోను....
నా నోము పండి అందిన నీ చెలిమితో
నా యీ క్షుద్ర జీవితం ఉద్ధరించిన నీ తలపులతో
సంతోషంగా కన్నుమూస్తాను....
యింతటితో కాలానికి కళ్ళెం వేస్తాను
కాంతిలేని గుండె తలుపులు మూసివేస్తాను!....

—వాణీ రంగారావు

## 16

గత వారంలో జరిగిన దుర్ఘటన వల్ల మనసులో కలిగిన అలజడి, నిన్నటి సత్యమూర్తి మాటలతో మరింత ఎక్కువయింది. రెండు హఠాత్ సంఘటనల్నీ నేను జీర్ణించుకోలేకుండా వున్నాను. దానికితోడు రాత్రి పడుకునే ముందు, అప్పుడే గుర్తొచ్చినవాడిలా అడిగాడు మాధవ-'' మమ్మీ! మరే డాడీ అంటే, అంకుల్‌లాగానే వుంటాడా?'' అని.

'' ఏం?'' అన్నాను. ఈ కంపేరిజన్ ఎందుకొచ్చిందా అని.

'' అదికాదూ-స్కూల్లో మా ఫ్రెండ్ సురేష్ లేడూ, అదే మమ్మీ, మన ఇంటికి అవతల వాళ్ళిల్లు. వాడన్నాడు. రోజూ మీ ఇంటి కొస్తాడే ఆయన మీ డాడీనా అని. కాదురా అంకుల్ అని చెప్పాను. అంకులే డాడీ అయితే ఎంత బావుంటుందో? కద మమ్మీ'' వాడి మాటలకి నా కళ్ళలో నీళ్ళొచ్చాయి. ఏమీ చెప్పలేకపోయాను. మా ఇద్దరి భవిష్యత్తునీ నిర్ణయించుకోవడానికి వీడు దారి చూపిస్తున్నాడా అనిపించింది. నా బుర్ర పనిచేయటం మానేసింది.

ఈ లోకంలో వయసులో వున్నస్త్రీ తోడులేకుండా గడపటం చాలా కష్టమని నాకు ముందే తెలుసు. శైలజ వున్నదనే ధైర్యంతోనే నేను వూరొదిలి మొట్టమొదట ఇక్కడికొచ్చాను. తనే లేకపోతే నేనింత ధైర్యం చేసుండేదాన్నేనా? ఏదో కష్టం వస్తే ఆదుకునే స్నేహితురాలున్నదని ధైర్యం. నా అదృష్టంకొద్దీ సహృదయుడయిన సత్యమూర్తి స్నేహం కూడా లభించింది. అందుకే ఒంటరిగా వున్నాననే భావమే నాలో ఎప్పుడూ కలుగలేదు.

ఆటుతరువాత అహ్మద్‌తో పరిచయం, పెళ్ళి జరిగి, నా అంత అదృష్టవంతురాలిక ఉండబోదనుకున్నాను. ఎన్నో ఏళ్ళు కాకుండానే, ఆ స్వర్గమూ నా చేతినుంచి జారిపోయింది. చేజారిన స్వర్గం మిగిల్చిపోయిన వరం మాధవ. వాడికోసమే నా జీవితం. ఒకటి-వాడు నా ప్రాణంలో ప్రాణమయిన శైలజ కన్నకొడుకు. రెండు స్వంతంగా సంతానం లేని నాకు పుత్రుడయి నన్ను తల్లినిచేశాడు వాడు. అందుకేనేమో, నాచేయి పట్టి నడిపించిన అహ్మద్ కంటే ఎక్కువగా ప్రేమిస్తాను వాణ్ణి. నేనేపని చేసినా అది వాడికి సుఖ సంతోషాల్నివ్వాలనే నా ఆత్రుత. వాడి ఆనందానికి భంగం కలిగించే పనేదయినా నేను నాచేతులారా చేయలేను. నా మనుగడకి అర్థం, నా కళ్ళకి చూపు నా ముద్దుల మాధవ.

అహ్మద్ పోయినా ధైర్యంగా ముందడుగు వేసిన నా మనస్థైర్యాన్ని ఆ వాళ జరిగిన దుస్సంఘటన కొంచెం సడలించింది. అది మచ్చుకొకటి మాత్రమే. ఎన్ని జరిగినా ఆశ్చర్యం లేదు. ప్రతీసారీ ఏ సత్యమూర్తో వచ్చి రక్షిస్తాడనే గ్యారంటీ లేదు. ఈ లోకంలో నాలాంటి వంటరిదానికి చోటులేదా అని సుడిగుండంలో చిక్కుకున్న దానిలా వాపోయాను.

'' అహ్మద్! నా ప్రియతమా. నీతోపాటు నన్ను తీసికెళ్ళకుండా. నన్నెందుకు వంటరిగా వదిలి వెళ్ళిపోయావు? కన్నీళ్ళంటే నీకసహ్యం అని కన్నీళ్ళు కార్చరాదనే అనుకుంటాను, కానీ ఈ పరిస్థితిలో ఈ ఒంటరి జీవితంలో కన్నీళ్ళు కారిస్తేనే కొంత ఉపశమనం కలుగుతూంది నాకు. నన్ను క్షమించు అహ్మద్! ఇప్పుడు నేనేంచేయాలి? నీకే నా మనసునీ, తనువునీ అర్పించుకుని, నాదంటూ ఏమీ మిగుల్చుకోని నన్ను నీ మిత్రుడు చేపడతానంటున్నాడు. ఎందుకు నామీదంత జాలి? అంటే జాలి కాదు. ప్రేమ అంటాడు. అతని ప్రేమ నిన్ను మనసులోంచి తొలగించలేని నన్ను ఆదరించి, భరించ గలదా? నువ్వే చెప్పు అహ్మద్!'' కళ్ళు మూసుకుని

అనుకున్నాను. ఏనాడో నన్ను వదిలి వెళ్ళిన అహ్మద్ నా పిలుపుకి పలికేనా? నాకు జవాబు చెప్పేనా!

అతడి మరణంతో దారీతెన్నూ తెలియకుండా పోయిన నా జీవితనావ సత్యమూర్తి చేతిలో తీరమే చేరుకుంటుందో లేక మరింత అలజడికే గురవుతుందో నాకు అంతు పట్టటం లేదు. ఇలాంటి పరిస్థితిలో శైలజ వుంటే నాకు కొండంత ధైర్యం వుండేది. ఎంతటి చిక్కుముడి నయినా తన తెలివితో ఇట్టే విప్పేసి నాకు దారి చూపేది.

సత్యమూర్తి తన ఇష్టంగా మాధవకి తండ్రినవుతా నంటున్నాడు. పిల్లాడికి తండ్రి లేని లోటు పెద్దదే. అలాగని నేను పెళ్ళికి వప్పుకుంటే, అతను నిజంగా తండ్రి కాగలడా? ఏమో? సవతి తల్లి అంటే ఎలా వుంటుందో నాకు తెలుసు. నేతి బీరకాయలో నెయ్యి వుందనుకోవటమూ, సవతితల్లీ తల్లి కాగలదనుకోవటమూ రెండూ ఒకటేనని నా అనుభవం చెప్పింది. ఆ విషయం తెలిసి మాధవకి సవతి తండ్రిని తీసుకు రానా? భవిష్యత్తులో తనకి కలిగే సంతానంతో సమానంగా అతను వీణ్ణి చూస్తాడా?

మన సమాజంలో భార్య పోయిన మగవాడు మళ్ళీ పెళ్ళి చేసుకోవటం మామూలు విషయం. అదే భర్త పోయిన స్త్రీ పెళ్ళి చేసుకుంటే మహాపచారం. మాధవకి తండ్రిలేని లోటు తీర్చటం కోసం ఈ పెళ్ళికి వప్పుకున్నా నా లక్ష్యం పూర్తిగా సిద్ధిస్తుందో! బెడిసి కొడుతుందో! పెద్దయాక, తన తల్లి చేసుకున్న రెండో భర్త ఈయన అని వాడికి తెలిస్తే అవమాన పడి మమ్మల్ని అసహ్యించుకుంటే? భగవాన్ నేను భరించ గలనా? అలాంటప్పుడిక ఈ పనికిరాని పునర్వివాహాన్ని చేసుకుని అతనికీ అసంతృప్తిని కలిగించటం, నేను అవమానాన్ని పొందటం ఎందుకు?

ఇలా ఎన్ని రకాలుగా ఆలోచనలు చేశానో! నాకు తోడుగా, నా తల్లిదండ్రుల్లో ఏ ఒక్కరు బతికున్నా నాకింత కష్టం వచ్చేదికాదు. ధైర్యంగా జీవిస్తూ, నా మాధవని పెంచుకునే దాన్ని, తోడులేని దాన్నని, భవిష్యత్తు భయపెడుతూంది.

వారంరోజులు రాత్రీ పగలూ, ఇలా ఆలోచనల్లో సతమత మవుతూ గడిపాను. భగవాన్! నువ్వే దారి చూపు అని ఎన్నిసార్లో ప్రార్థించాను.

ఆఖరికి నిజంగా దేవుడే నాకు దారి చూపాడు. కలలో నయినా తలుచుకోని విషయం జరిగింది. ఈ జన్మకి కళ్ళతో చూస్తానని అనుకోని వ్యక్తి నా ఇల్లు వెతుక్కుంటూ వచ్చింది; వస్తూ, మాధవ భవిష్యత్తుకు వెలుగునిచ్చే వార్త ఒకటి పట్టుకొచ్చింది.

సాయంత్రం స్కూల్నించీ ఇంటికొచ్చేసరికి తాళం వేసిన ఇంటి ముందు, చిన్న చేతిసంచీ పట్టుకుని కూచుని వుంది మా పిన్ని. అల్లంత దూరం నించే ఆవిణ్ణి చూసి, ఆశ్చర్యపోతూ వచ్చాను. తాళం తీసి లోపలికి తీసికెళ్ళాను.

''బాగున్నావా తల్లీ?'' అని పలకరించింది పిన్ని. ఆ పిలుపుకీ దాన్లోని ఆప్యాయతకీ ఉక్కిరిబిక్కిరయ్యాను. వచ్చింది మా పిన్నేనా అనుకుంటూ ఆవిడ ముఖంలోకి చూశాను. మూఖాన బొట్టు లేకనేమో, వృద్ధాప్యపు ఛాయలు మరింతగా కన్పిస్తున్నాయ్. కళ్ళచుట్టూ ఏర్పడిన వలయాలు లోపలికి పోయిన బుగ్గలూ ఆవిడ పరిస్థితిని చెప్పక చెబుతున్నాయ్.

''తమ్ముడెలా వున్నాడు పిన్నీ?'' అన్నాను. అంతే ఇక ఏడుస్తూ కూచుంది. 'ఇంకా ఎక్కడ తమ్ముడే అమ్మా! ఆనాడు వాడు పైకి రావాలని


# అఖిల భారత
# కేమెల్
# రంగుల పోటీలో పాల్గొనండి

**మా రంగుల పోటీలలో 2000 పాఠశాలల నుండి 14 లక్షల సంఖ్యలో పాల్గొన్న విద్యార్థుల ఉత్సాహాన్ని చూచి ఇపుడు మరింత పెద్ద పోటీని సహర్షంగా ప్రకటిస్తున్నాము.**

కేమలిన్ మీ చిత్రకళా ప్రతిభను గౌరవిస్తుంది. భారత దేశంలో మీరు ఏ మూల వున్నా, ఏ పాఠశాలలో చదువుతున్నా సరే, చేతి గడియారములు, అలారమ్ గడియారములు మున్నగు అందమైన బహుమతులను కేమలిన్ మీకు అందించగలదు. వెంటనే మా రంగుల పోటీలో పాల్గొనండి. మీ చిత్రకళా నైపుణ్యాన్ని చూపండి. మీరు మా 700 బహుమతులలో దేనినైనా సగర్వంగా గెలుచుకోగలరు.

మీకు ఇష్టమైన ఈ 6 విషయాలపై చిత్రాలను చిత్రించవచ్చు. ఆటలు, పండుగలు, పక్షులు, సీతాకోక చిలుకలు, పూలు, జంతువులు. మీ మీ తరగతులను బట్టి పోటీదార్లను క్రింద ఇవ్వబడిన మూడు వర్గాలలో విభజించుట వలన బహుమతులు గెల్చే అవకాశం చిన్నా, పెద్దా అందరికీ వుంటుంది.

(ఎ) ప్రీ-ప్రైమరీనుండి 4వ తరగతి వరకు
(బి) 5వ తరగతినుండి 8వ తరగతి వరకు
(సి) 9వ తరగతినుండి 11వ తరగతి వరకు

ఈ పోటీలో పాల్గొనడానికి ప్రవేశ రుసుము లేదు. మీకు కావల్సిందల్లా ఎంట్రీ కూపన్ మాత్రమే. పోటీ సంబంధమైన చట్టములు, నియమములు గల ఎంట్రీ కూపన్ మీకు మా స్టూడెంట్స్ అండ్ ఆర్టిస్ట్స్ వాటర్ కలర్ కేక్స్, స్టూడెంట్స్ వాటర్ కలర్ ట్యూబ్స్, పోస్టర్ కలర్ ట్రయల్ ప్యాక్స్ మరియు ఆయిల్ పేస్టల్స్‌తో పాటు లభించగలదు.

కేమ్లిన్ ప్రైవేట్ లిమిటెడ్,
ఆర్ట్ మెటీరియల్ డివిజన్,
అంధేరి, బొంబాయి 400 059.



రూ. 30000/ విలువగల 700 బహుమతులు

కేమెల్ కలర్స్ ఈరోజే
కొనండి. పోటీ కాలము:
**జూన్ - సెప్టెంబర్ 1978.**

VISION 784 TEL

నీకు అన్యాయం చేశాను. కానీ నువ్వు చెడిపోయిందీ లేదు. వాడు బాగుపడిందీ లేదు. మీ నాన్న పోయాక, వాడు మరీ నా మాటవినకుండా పోయాడు, చదువూ లేదు. ఉద్యోగం అసలేలేదు. తన ఇష్టం వచ్చినప్పుడింటికి రావటం, ఉన్నంతసేపూ డబ్బిమ్మని పీక్కుతినటం, ఇచ్చిందంతా ఏం చేస్తాడో ఆ దేముడికే తెలుసు.

"మొన్నటికి మొన్న ఏదో వ్యాపారం చేస్తానని నమ్మించి నా దగ్గరున్న సొమ్ములన్నీ అమ్మిస్తే డబ్బు పట్టుకుపోయాడు. నెల రోజులయింది. పత్తాలేదు. ఇంక వస్తాడనే నమ్మకమూ లేదు. నాకు వేరే దిక్కెవరున్నారు నువ్వుతప్ప. నీ కెన్నో అన్యాయాలు చేశాను. కష్టాలు పెట్టాను. అయినా నీ ఇంట్లో దాసీపని అయినా చేద్దామని వొచ్చాను సీతా!....అన్నట్టు నువ్వు పెంచుతున్న బాబు మనవూరి రంగయ్యగారి మనవడటగా? ఆయన ఈ మధ్యనే చనిపోతూ, తనకున్న ఆస్తి అంతా నీ పేర్న రాశాడట. ఎవరో అనుకుంటుంటే విన్నాను" అంది.

## 17

రంగయ్యగారి పేరు వినగానే, కొన్నేళ్ళక్రితం అహ్మద్ ఉండగా జరిగిన సంఘటనలు గుర్తొచ్చాయి. అప్పట్లో ఆయన కోరిక మేరకు అహ్మద్ అప్పుడప్పుడు మాధవను తీసుకుని ఆయన దగ్గరికి వెళ్ళి వస్తుండేవాడు.

అప్పుడు బాబుకి మూడేళ్ళనుకుంటాను. ఒకసారి వెళ్ళినప్పుడు ఆయనే అన్నారట హఠాత్తుగా – ఇంక తీసుకురావద్దని. మాధవకి తెలిసినంతలో వాడికి అమ్మానాన్నలు మేమే. మేము కన్నవాళ్ళం కాదని తెలియదు. శైలజ, ప్రభాకర్‌ల రూపాలు కూడా వాడికి గుర్తులేవు. వాడు అప్పుడప్పుడు రంగయ్యగారి దగ్గరికి, మా వూరికీ వెళ్తుంటే, ఎప్పుడోసారి నిజం వాడికి తెలియకపోదు. అందులోనూ అప్పుడప్పుడే బుద్ధి తెలుస్తున్న కుర్రవాడు. తన స్వంత తల్లిదండ్రులు పోయినట్లు వాడికి తెలియటం ఆయన కిష్టం లేదట. అందుకే రావద్దన్నారు. ఎక్కడున్నా వాడు సంతోషంగా వుంటే చాలని చెప్పిపంపారట. ఇప్పుడు చనిపోతూ ఆస్తిని నా పేరట రాయటం ఎందుకు? మాధవపేరనే రాయాలిసిందేమో! నాకూ వారి కుటుంబానికీ రక్తసంబంధం లేదు. బాబును పెంచుతున్నానని, నాపై నమ్మకంతో, చివరకు అంతా తన మనవడికే చేరుతుందనే ధైర్యంతో నన్ను నమ్మి, నా పేరున రాశాడు. ఇక వాడి భవిష్యత్తు గురించి నేనంతగా దిగులుపడనవసరం లేదు. వూరికే వుండలేక ఏదో ఒక ఉద్యోగం చేయాలే గానీ, డబ్బు సంపాదించి వాడికోసం కూడబెట్టాలనే అవసరమంత ఉండదు!

సుఖదుఃఖాలు ఎప్పుడూ ఒకదాన్నంటి ఒకటి వుంటాయనే సత్యం నా విషయంలో ఋజువవుతూనే వుంది. ఆనాడు శైలజ పోయినదిగులు బాబుని పెంచటంలో మరిచాను. ఈ రోజు గతవారంలో జరిగిన సంఘటనల వల్ల కలతబారిన నా మనసుకి శాంతి చిక్కింది. ఒకటి బాబు భవిష్యత్తుకి మంచి ఆధారం దొరికింది రంగయ్యగారి ఆస్తితో. రెండు ఒంటరిగా నేనుండాల్సిన అవసరం లేకుండా పిన్ని నాతోపాటే వుండాలని వచ్చింది. నా సమస్యలన్నీ మంచులా విడిపోయాయి. నా దారేమిటో కళ్ళముందు స్పష్టంగా కన్పిస్తూంది. ఆలశ్యం చేసి, మూర్తికి మరింతగా ఆశకల్పించ దలచుకోలేదు. అందుకే మరురోజే నా నిర్ణయాన్ని చెప్పేశాను. కొద్దిగా షాక్ అయినట్లు కనిపించినా బాగా నిగ్రహించుకున్నట్లే వున్నాడు.

ఒక నెలలోపుగానే సత్యమూర్తికి ఏదో వూరికి పోస్టు చేస్తూ ఆర్డర్స్ వచ్చాయి. అతను శాశ్వతంగా హైదరాబాద్ వదిలి వెళ్ళిపోయాడు. ఒక మంచి స్నేహితుడు దూరమయాడనే బాధ చాలా రోజులపాటు నా మనసులో నిలిచిపోయింది.

మా పిన్ని చాలా మారిపోయింది. ఆనాడు ఆవిణ్ణి చూసినవాళ్ళెవరూ, ఈ రోజు నా దగ్గరున్న పిన్నిలా అవుతుందని కలలో కూడా అనుకోలేరు. అప్పుడు నేనావిడకు పరమశత్రువుని. నేను బాధపడితే ఆమెకు సంతోషం. నేను ఎందులోనయినా పైకొస్తే ఆవిడ కుంగిపోయేది. వీలయినంతవరకూ నన్ను పాతాళానికే అణగదొక్కేది. తన కొడుకే ఆమెకి లోకం. వాడొక రాజాలా పెరగాలని కోరుకుంది. ఆ కోరికే కొంపలు ముంచిందని ఇవాళ ఆవిడకూ తెలిసిన విషయమే. ఇప్పుడిలా ఆవిడ నా మీద చూపించే ప్రేమాభిమానాలకి, తను దిక్కులేనిదవటం, నాకు ఆస్తి రావటం మాత్రమే కారణాలుగా కన్పించదు. ఆవిడ మనసులోనే పశ్చాత్తాపం చాలా మార్పు తెచ్చిందేమో అనిపిస్తుంది. అప్పటి తలబిరుసుతనమేమయిందో— చాలా నెమ్మదిగా, నిదానంగా తన పనులు తాను చేస్తుంది. నాతో ఎంతో ఆప్యాయంగా వుంటుంది. మాధవకి ఆమె అన్నా, ఆమెకి వాడన్నా చాలా ఇష్టం.

వాళ్ళమ్మమ్మ వచ్చినప్పట్నించీ కొన్ని రోజులపాటు వాడు స్నేహితుల్తో ఆడుకోవటం కూడా మానేసాడు. స్కూల్‌కెళ్ళొచ్చాక ఇంట్లో వున్నంతసేపూ ఆమెతోటే కబుర్లు. ఆవిడ రాకవల్ల, సత్యమూర్తి వెళ్ళిపోయిన లోటు కూడా వాడికంతగా కన్పించలేదు.

ఇంట్లో వంటపనంతా తనే చేసేది పిన్ని. నేనే పని చేయవచ్చినా "ఉద్యోగం చేసేదానివి నీకెందుకీశ్రమ. నువ్వెళ్ళి రెస్ట్‌తీసుకో సీతా! అయినా ఇద్దరి వంట ఎంతపని అరగంటలో అయిపోదూ?" అంటుంది. ఆవిడ చూపించే ప్రేమకి నా కళ్ళలో నీళ్ళు తిరిగేవి. ఇంతటి మాతృప్రేమని తనలో దాచుకుని, నా చిన్నప్పుడు నన్నెందుకంతగా ఏడ్పించిందా అనిపించింది. అదీ నా దురదృష్టమేనేమో అనుకున్నాను. అప్పుడప్పుడు తమ్ముడు రాజు ఎక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో అని గుర్తుచేసుకుని దిగులుపడేది.

ఐ. ఏ. ఎస్ సెలక్ట్ అయిన సంవత్సరం లోపుగానే సత్యమూర్తి పెళ్ళయిపోయింది. నాకు వెడ్డింగ్‌కార్డ్ పంపాడు. అది చూడగానే నాకు కొండంత దిగులు తీరింది. అతడి కోరికను తిరస్కరించి నిరుత్సాహపరిచేనని తెలుసు. పోనీ ఆ బాధని మరిచి పెళ్ళి చేసుకుంటున్నాడంటే సంతోషం కాదూ మరి!

## 18

వెడ్డింగ్ కార్డ్ వెంబడే ఉత్తరం కూడా వచ్చింది సత్యమూర్తినించి. "నాకున్న అత్యంత ఆత్మీయుల్లో మీరొకరని నేను చెప్పే అవసరం లేదు. మీకు తెలుసు. ఇన్నాళ్ళకి మా నాయనమ్మ కోరిక తీర్చక తప్పింది కాదు. నాకూ ఒంటరి జీవితం బోర్‌కొట్టిపోయింది – అందుకే ఈ పెళ్ళి. పెళ్ళికి మీరొస్తే నాకు సంతోషమూ, సంతృప్తి. మన స్నేహం కలకాలం పచ్చగా వుండాలని కాంక్షిస్తూ, మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను" అని రాశాడు. ఉత్తరం క్లుప్తంగా వున్నా, అందులో వున్న ఆప్యాయతా, ఆత్మీయతా అపారం.

సత్యమూర్తి కోరికని తిరస్కరించలేకపోయాను. మాధవని తీసుకుని బయలుదేరాను.

[సశేషం]